క్లుప్తంగా

ప్రమాదకరంగా ఉండ్రాజవరం రోడ్డు



ఉండ్రాజవరం రోడ్డులో ఒరిగిన లారీ

దెందులూరు: సత్యనారాయణపురం నుంచి పోతునూరు వెళ్లే ఉండ్రాజవరం రోడ్డు భారీ గోతులతో నిండి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై తరుచూ వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. లారీలు, ట్రాక్టర్లకు సైతం ఈ గోతుల్లో ఇరుక్కుని ముందుకు వెళ్లలేని పరిస్థితి. అధికారులు స్పందించి ఈ రోడ్డుకు తక్షణం మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిడమర్రు ఎస్సైగా వీరప్రసాద్



నిడమర్రు: నిడమర్రు ఎస్సైగా ఎన్.వీరప్రసాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని విజయవాడ సిటీ, ఉయ్యూరు తదితర పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన ఆయన బదిలీపై నిడమర్రు పీఎస్‌కు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్సైగా ఉన్న ఆర్.శ్రీను వీఆర్‌లోకి వెళ్లినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై వీరప్రసాద్ మాట్లాడుతూ మహాలక్ష్మి సెంటర్‌లోని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతోపాటు మండలంలోని పేకాట, కోడిపందేలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఈ సందర్భంగా ఆయనను పోలీస్ సిబ్బంది పూలదండలు, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని దళిత సేన ఏలూరు నగర కమిటీ సమావేశం జిల్లా దళిత సేన మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ లావేటి ప్రవళిక అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవిప్రకాష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద బాధితులు చేసే ఫిర్యాదులపై విచారణ అనే పేరుతో ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఆలస్యం చేస్తున్నారన్నారు. దీనివల్ల బాధితులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ కేసుల విషయంలో బాధితులకు చట్ట ప్రకారం ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులను తక్షణమే చెల్లించేలా మార్గ నిర్దేశం చేయాలని కోరారు. సమావేశంలో ఏలూరు నగర దళిత సేన మహిళా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి మధులత, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో ఆదివారం విజిలెన్స్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా రేషన్ బియ్యం కలిగి ఉన్న చావా రామకృష్ణ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.4,680 విలువైన 117 కేజీల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్ డీటీ వైవీ లక్ష్మీకుమారి తెలిపారు.

15న విద్యార్థులకు పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నగరంలోని విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వర రావు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి వేమా కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా ఉదయం 10 గంటల నుంచి వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలైన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఐదు కన్సొలేషన్ బహుమతులు అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు వైఎంహెచ్ఏ హాలు కార్యాలయంలో 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 90323 23632, 94930 59598 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేస్తుండడం అభినందనీయమని డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు అన్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1980–83 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సుమారు రూ.60 వేల వ్యయంతో సరస్వతీ అమ్మవారి విగ్రహం, జాతీయ చిహ్నమైన నాలుగు సింహాల స్తూపాన్ని ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులను రాంబాబు అభినందించారు. జూనియర్ కళాశాలను ఆనుకుని ఉన్న స్థలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజాప్రతినిధులు ఆయన్ను ఈ సందర్భంగా కోరారు. విశ్వనాథ శర్మ, దీక్షితులు, దొమ్మేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో పంట కాలువలు

ఆక్వా వ్యర్థజలాలు వదిలివేస్తుండటం వల్లే

- డెల్టాలో నీటి వనరులన్నీ కలుషితమైన వైనం
- స్వచ్ఛమైన తాగునీరు కావాలంటే ప్లాంట్లే దిక్కు
- నీటి కాలుష్యం నివారణకు కానరాని చర్యలు



కొత్తపల్లిలో పంటకాలువలో కలుషిత నీటిలోనే పశువులు కడుగుతున్న రైతు



చినకాపవరం పంట కాలువలో కలుషితమైన నీరు

గణపవరం: ఆక్వా సాగు వల్ల రైతులకు లాభాలు, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతున్నా ప్రజలకు మాత్రం కాలుష్యాన్ని అందిస్తోంది. ఆక్వా చెరువులలోని కలుషిత నీటిని పంట, మురుగు కాల్వలలోకి ఇష్టానుసారంగా వదిలివేయడంతో డెల్టాలో దాదాపు నీటివనరులు మొత్తం కలుషితమైపోయాయి. ప్రజలకు శుభ్రమైన తాగునీరు దొరికే పరిస్థితి డెల్టాలోని ఏగ్రామంలోనూ మచ్చుకు కూడా కనిపించే పరిస్థితి లేదు. దీంతో ఏగ్రామంలో చూసినా ప్రజలంతా వాటర్ ప్లాంట్‌ల నుంచి తాగు నీటిని కొనుక్కుని తెచ్చుకుని తాగాల్సిన పరిస్థితి. నీటిని కొనుగోలు చేసుకునే స్తోమత లేనివారు కాలువ నీటినే మరగ కాచుకునో... వడబోసుకునో తాగుతున్నారు. కానీ నోరులేని పశువులు మాత్రం ఈ కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నాయి. చేపలు, రొయ్యల చెరువుల పుణ్యమా అని డెల్టాలోని మొత్తం పంట, మురుగు కాల్వలన్నీ కాలుష్యం కోరల్లో చిక్కుకున్నాయి.

ఆక్వా సాగు లేని గ్రామం లేదు

అటు ఏలూరు నుంచి ఇటు నర్సాపురం వరకు డెల్టాలో ఆక్వా సాగు లేని గ్రామం అంటూ లేదనే చెప్పవచ్చు. ఆక్వా చెరువులలో చేపలు, రొయ్యలకు వేసే మేతలు, మందులు, ఇతర రసాయనాలతో పాటు కోళ్లు, పశువుల వ్యర్థాలు అన్నీ కాలుష్య కారకాలే. ఆక్వా చెర్వులలోని నీరు ఆకుపచ్చని రంగులో చిక్కబడి, దుర్వాసన వస్తుంటుంది. చేపలు, రొయ్యలు పట్టుబడి సమయంలో ఆ నీటిని పంట, మురుగు కాల్వలలోకి అక్రమంగా వదిలేయడంతో నీటి వనరులు మొత్తం కాలుష్యం బారిన పడుతున్నాయి. ఈ పంట కాలువలలోని కలుషిత నీరు గ్రామాలలో మంచినీటి చెరువులకు చేరి, అవి కూడా కలుషితంగా మారిపోతున్నాయి. పంచాయతీలు ఈ నీటినే కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నాయి. ఈ నీటిని తాగిన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మనుష్యులతో పాటు పశువులకు కూడా ఈ కలుషిత నీటి బెడద తప్పడంలేదు. ఒకప్పుడు పంట, మురుగు బోదెలలో పరిశుభ్రమైన నీరు ఉండేది. ఆనీటిని నేరుగా దోసిళ్లతో తాగేవారు. పొలాలకు వెళ్లే కూలీలు, రైతులు పంట కాలువలు, చెరువులలో నీటినే తాగేవారు. పశువులు కూడా ఆనీటిని తాగి దప్పిక తీర్చుకునేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జిల్లాలో ఏపంట, మురుగు కాల్వలు చూసినా చేపలు, రొయ్యల చెర్వుల నుంచి వచ్చిచేరిన కలుషిత నీటితో నిండి ఉంటున్నాయి. ఆనీరు తాగడానికి ఏమాత్రం పనికిరాకుండా ఉంటుంది. గత్యంతరం లేనిస్థితిలో పశువులు ఆనీటినే తాగి రోగాలకు గురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గణపవరం, నిడమర్రు మండలాల్లోని గ్రామాలు మొత్తం ఆక్వా సాగు విస్తరించడంతో ఈ కాలుష్యం బెడద మరీ ఎక్కువగా ఉంది. గణపవరం మండలంలోని ఎ.గోపవరం పంటకాల్వ గోపవరం, వరదరాజపురం, కొత్తపల్లి, సరిపల్లె గ్రామాలకు, ఎస్.కొందేపాడు గ్రామానికి కొమ్మర చానల్ పంటకాల్వ, కొమ్మర పంటకాల్వ ద్వారా వీరేశ్వరపురం, వాకపల్లి, కొమ్మర గ్రామాలకు, చినకాపవరం కాలువ ద్వారా మందలపర్రు, బువ్వనపల్లి, ఎనికేపల్లి, సిద్ధాపురం, బావాయిపాలెం, క్రొవ్విడి, పెదకాపవరం, చినకాపవరం గ్రామాలకు, వెంకయ్య కాలువ ద్వారా కొమ్మర, గణపవరం, సరిపల్లె, క్రొవ్విడి, బావాయిపాలెం గ్రామాలకు తాగు నీరు అందుతోంది. అయితే ఈ కాలువలోకి తరచూ అక్రమంగా ఆక్వా చెరువులోని కలుషిత నీటిని వదిలివేయడం వలన గ్రామాలకు తాగునీరు సరఫరాచేసే ఈ కాలువల్లో నిత్యం కలుషితనీరు ప్రవహిస్తూ ఉంటుంది. భవిష్యత్‌లో కాలుష్యం తీవ్ర రూపం దాల్చే అవకాశం లేకుండా ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంట కాలువలు కాలుష్యం బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఈ నెల 16వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.సుమతి చెప్పారు. ఆదివారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రెవెన్యూకు సంబంధించి సమస్యలపై అర్జీలను ప్రజలు తనకు అందించవచ్చని అన్నారు. ప్రతిరోజూ గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ సదస్సులు జరుగుతాయని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

15న సాల్వేషన్ ఆర్మీ కార్యదర్శుల రాక

దెందులూరు: సాల్వేషన్ ఆర్మీ అంతర్జాతీయ కార్యదర్శులు దాసరి జాన్‌కుమార్, మణికుమార్ తొలిసారిగా భారతదేశం విచ్చేస్తున్నారని సాల్వేషన్ ఆర్మీ ఏలూరు జిల్లా డివిజనల్ కమాండర్ జల్లి మోషే, మేరికుమార్, దెందులూరు కోర్ ఆఫీసర్ కే.రమణయ్య ఆదివారం చెప్పారు. భారతదేశానికి అధికార హోదాలో ప్రప్రథమంగా రావడమే కాక స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్య అతిథులుగా విచ్చేయడం అభినందనీయమని చర్చి దాత, తెలంగాణ హ్యూమన్ రైట్స్ కమిషన్ డైరెక్టర్ పళ్ళె హర్షవర్దన్ అన్నారు.

నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

గణపవరం: మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 12వ తేదీ నుంచి మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆదివారం తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈశిక్షణ మూడురోజుల పాటు 12, 13, 14 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరుగుతుందన్నారు. ఈశిక్షణకు అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్1 నుంచి గ్రేడు 5వరకూ హాజరుకావాలని కోరారు.

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో మెలగాలి



భీమడోలు లైబ్రరీలో చిన్నారులకు హర్ ఘర్ తిరంగాపై అవగాహన కల్పిస్తున్న మండే సుధాకర్

భీమడోలు: స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని విద్యార్థి దశ నుంచి అలవర్చుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం 'చదవడం మాకిష్టం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు పుస్తక పఠనం చేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ చిన్నారులకు నీతి కథలు, విద్యాబుద్ధులను నేర్పించారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈనెల 13 నుంచి స్వాతంత్ర్యోద్యమ వేడుకలను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి ఇంటా జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. జాతీయ నాయకులు, త్యాగధనుల జీవితాన్ని స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నేతలు



భీమడోలులో బీజేపీ నాయకులతో చర్చిస్తున్న కేంద్ర మంత్రి భూపతి శ్రీనివాసవర్మ

భీమడోలు: బీజేపీ శ్రేణులంతా సంఘటితంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖా సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. భీమడోలులో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన మంత్రిని ఆదివారం జిల్లా, నియోజకవర్గ బీజేపీ నేతలు కలిసి పుష్పగుచ్ఛాలను అందించి అభినందించారు. అనంతరం భీమడోలులోని ఉంగుటూరు నియోజకవర్గ కో–కన్వీనర్ వెజ్జు ధర్మారావు కార్యాలయంలో ఆయన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరితో కలిసి పార్టీ నాయకులతో పార్టీ స్థితిగతులు, పటిష్టత తదితర అంశాలపై చర్చించారు. నాయకులు పులి వీరరాఘవులు, వర్ధినేడి కపిరాజు, జల్లా సత్యనారాయణ, బి.మూర్తి, కె.హనుమంతరావు, సత్తి సుశీలరాణి, దండే లాల్‌బహదూర్‌శాస్త్రి, రామిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

సూరిబాబు మాస్టారు సేవలు భేష్



ఉపాధ్యాయుడు సూరిబాబు దంపతులకు పాదాభివందనం చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉంగుటూరులో ఆదివారం ఉపాధ్యాయుడు కరింశెట్టి సూరిబాబు పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సూరిబాబు మాస్టారు అందించిన సేవలు ఎంతో ఉన్నతమైనవి అన్నారు. అనంతరం సూరిబాబు దంపతులను శాలువాతో సత్కరించి ఎమ్మెల్యే పాదాభివందనం చేశారు. శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రజకుల సమస్యల పరిష్కారానికి కృషి

గణపవరం: రజకుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం గణపవరం మండలం సరిపల్లెలోని వెంకటేశ్వర రజక కల్యాణమండపంలో గణపవరం, సరిపల్లె రజక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకుల వృత్తి పరమైన సమస్యలు పరిష్కరిస్తానని, రజకులకు చెరువులపై పూర్తి హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన రజకులకు సబ్సిడీ రుణాలు, ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు వంటివి అందజేయడానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా రజక సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ధర్మరాజును సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తోట శ్రీను, బుద్ధారపు పుల్లయ్య, నిమ్మల దొరబాబు, క్రొవ్విడి సాయి, గంటా అన్నవరం, టీడీపీ నాయకులు ఇందుకూరి రామకృష్ణంరాజు, కూసంపూడి సురేంద్ర, రజక సంఘ నాయకులు పాల్గొన్నారు.

అధికారం కోసమే చంద్రబాబు హామీలు



దొరమామిడిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న భారతి

బుట్టాయగూడెం: ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్సం లత, వెట్టి భారతి డిమాండ్ చేశారు. మండలంలోని దొరమామిడిలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సంపద సృష్టిస్తామని చెప్పి ఇప్పుడు నిధుల కొరత వెంటాడుతుందంటూ చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు అధికారం కోసమే హామీలు ఇచ్చారే తప్ప మహిళలపై ప్రేమతో కాదన్నారు. మద్యం పాలసీ వల్ల మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అయితే ప్రభుత్వం మద్యాన్ని ప్రధాన ఆర్థిక వనరుగా ఎంచుకోవడం సిగ్గు చేటని అన్నారు. మద్యాన్ని నిషేధించి ప్రజలకు ప్రాణరక్షణ కల్పించాలని అన్నారు. లేనిపక్షంలో మహిళా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఇందుకోసం అక్టోబర్ నెలలో జిల్లా మహాసభలు నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ఈమని మల్లిక, కారం అరుణ, ధర్ముల లక్ష్మి, తగరం సత్యవతి, సరియం అనిత, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కామవరపుకోట: మండలంలో పేకాట స్థావరంపై దాడి పోలీసులు దాడి చేశారు. వడ్లపల్లి గ్రామ శివారులో ఆదివారం పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ఎస్సై జయబాబు తన సిబ్బందితో దాడి చేసి, ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.6,950 నగదు, ఏడు మోటర్ సైకిళ్లు సీజ్ చేసినట్లు చెప్పారు. ఈమేరకు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



రవిప్రకాష్

దెందులూరు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పోలీసు అధికారులు పటిష్టంగా అమలు చేయాలని దళితసేన వ్యవస్థాపకులు రవిప్రకాష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఐపీఎస్ స్థాయి అధికారులు ప్రతి సోమవారం ప్రజల నుంచి వినతులు తీసుకునే మాదిరిగా ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని అమలు చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. ఇకపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ఐఎఎస్, ఐపీఎస్ అధికారులు పర్యవేక్షించేలా ఉద్యమాన్ని చేపడతామన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రధాని మోదీ పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పారేపల్లి వీర వెంకట సత్యనారాయణ కోరారు. ఆదివారం లక్కవరంలో నిర్వహించిన పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటిపై జెండా ఎగుర వేయడం, స్వచ్ఛభారత్, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులర్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

అంబేడ్కర్ జోలికి వస్తే తడాఖా చూపిస్తాం



బొడ్డేటి స్టాలిన్

దెందులూరు: భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం జోలికి వస్తే భరతం పడతామని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు బొడ్డేటి స్టాలిన్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సంఘ విద్రోహశక్తులు విజయవాడలో అంబేడ్కర్ విగ్రహానికి అవమానం చేసేలా చర్యలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. అంబేడ్కర్ అన్ని వర్గాల ప్రజల హక్కుల పరిరక్షణకు రాజ్యాంగాన్ని రచించారన్నారు. కాని దీనికి భిన్నంగా దళితుల మనోభావాలు దెబ్బతినేలా అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించడం సహించబోమన్నారు. ప్రభుత్వం విచారణ నిర్వహించి దోషులను శిక్షించకపోతే ప్రభుత్వంపై దళితుల్లో వ్యతిరేక భావన, అనుమానించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దోషులను శిక్షించాలని స్టాలిన్ డిమాండ్ చేశారు.

ఈవ్ టీజింగ్ నుంచి కాపాడండి



పరింపూడి హాస్టల్లో ఎమ్మెల్యేకి సమస్యల గురించి చెబుతున్న స్టూడెంట్స్

కొయ్యలగూడెం: ఈవ్ టీజింగ్ నుంచి తమల్ని కాపాడాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వద్ద ప్రభుత్వ ఎస్టీ కళాశాల హాస్టల్స్ విద్యార్థులు మొర పెట్టుకున్నారు. పరింపూడిలోని బాలికల ఎస్టీ హాస్టల్‌ను ఆయన ఆదివారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులు తగినంతమంది హాస్టల్లో లేకపోవడం గురించి సిబ్బందిని అడిగి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కళాశాల యువతులు, హైస్కూల్ విద్యార్థినులు తమ సమస్యలను ఎమ్మెల్యే వద్ద ఏకరువు పెట్టారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో హాస్టల్ గేట్ల ముందు జులాయిల ప్రవర్తనలతో విసుగు చెందుతున్నామని కళాశాలలకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులకు చెబితే చదువు మానిపించేస్తారేమోనని భయంతో మిన్నకుండిపోతున్నామని ఎమ్మెల్యే వద్ద పేర్కొన్నారు. అదేవిధంగా డ్రైయినేజీ సౌకర్యం లేకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోందని, హాస్టల్లో ఫ్యాన్లు సౌకర్యం పూర్తిస్థాయిలో లేదని వాపోయారు. విద్యార్థినుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వర్షాలకు దెబ్బతిన్న ముంజులూరు రహదారి



ముంజులూరు రహదారి మరమ్మతులకు గ్రామస్తులు శ్రమదానం చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన ముంజులూరు, గోగుమిల్లి రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్నాయి. గతంలో ఈ రహదారికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో తారురోడ్డు వేయడం జరిగింది. తదుపరి ఈ రహదారి కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పులిరామన్నగూడెం నుంచి రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.3 కోట్ల వరకూ నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు అప్పటి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శంకుస్థాపన కూడా చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులు నిలిచాయి. ప్రస్తుతం ఈ రహదారి అధ్వానంగా ఉంది. ప్రతి బుధవారం కన్నాపురం సంతకు, ఇతర పనుల నిమిత్తం గడ్డపల్లి, గిన్నేపల్లి, ముంజులూరు, దారావాడ గ్రామాల నుంచి గిరిజనులు వస్తూ ఉంటారు. ప్రస్తుతం రోడ్డు అధ్వానంగా ఉండడంతో గ్రామస్థులే శ్రమదానం చేసి ఆ రోడ్డులోని గోతుల్లో మట్టిని వేసి మరమ్మతు పనులు చేసుకుంటున్నారు. గతంలో మంజూరైన నిధులతో ఈ రహదారిని నిర్మించేందుకు అధికారులు కృషి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని వినతి

కొయ్యలగూడెం: కాంట్రాక్ట్ అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయాల్సిందిగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు వినతిపత్రం అందజేశారు. కొయ్యలగూడెం పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఆయన్ను కాంట్రాక్ట్ అధ్యాపకులు కలుసుకొని తమ సమస్య గురించి వివరించారు. గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 40 మంది వరకు పోలవరం నియోజకవర్గంలో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తూ ఉన్నామన్నారు. ప్రభుత్వం తమ సేవలను గుర్తించి తమతో సహా రాష్ట్రంలో ఉన్న 3600 మంది కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని కోరారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిల దృష్టికి తీసుకువెళ్లి తమ సమస్యను పరిష్కరించాల్సిందిగా వారు కోరారు. డి.జ్యోతిర్మయి, పి.విక్రమ్, ఎం.సుజాత, ఎ.హిమబిందు, ఏపీ వీరభద్రం, పి.అనంతలక్ష్మి, కె.రాధాకృష్ణ, కె.నాగేశ్వరరావు, ఎం.సోమరాజు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతపై ప్రచారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హిందూ సమాజంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా నిర్వహించే ఊరేగింపు విశిష్టతపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. స్థానిక తంగెళ్ళమూడిలోని యాదవ నగర్‌లో నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో తాడేపల్లిగూడెం కమిటీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ రూపంలో జన్మించిన పరమాత్ముడు శ్రీకృష్ణుడు అని, ఆయన గురించి సమాజానికి తెలియజేయడానికే ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. పూర్వం శ్రీ కృష్ణ జన్మాష్టమికి 11 రోజుల పాటు ఊరేగింపు నిర్వహించేవారని, చివరి రోజున చవితి నాడు ఊరేగింపు ముగించేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.కోటేశ్వర రావు, సీహెచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

100 మందికి కంటి పరీక్షలు

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెంలో గ్రామంలో ఫర్ ద పీపుల్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నిడదవోలుకు చెందిన రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ నేత్ర వైద్యశాల వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. 100 మందికి పరీక్షలు నిర్వహించి 20 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ కలపర్తి విజయ్, రెల్ల మోషే, గుండె ప్రవీణ్‌కుమార్, రవి, గాంధీ, వీర్రాజు, సురేష్, మోషే పాల్గొన్నారు.